ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

మంగళవారం 17 సెప్టెంబరు 2024

గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0

***

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.746)	67,983	77,998
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.1 (4.23)	445.23	630.62
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.21 (44.53)	36,783	51,042

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



తొమ్మిది రోజులుగా పూజలందుకున్న వినాయకుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ కన్నులపండువగా సాగిన శోభాయాత్ర అనంతరం స్థానిక చెరువులు, కుంటలు, కాల్వల్లో వినాయక ప్రతిమలను భక్తులు నిమజ్జనం చేశారు. డప్పు చప్పుళ్లు, సన్నాయి మేళాలు, డీజేల మోతల మధ్య నృత్యాలు చేస్తూ గణనాథుడిని ఊరేగించారు. కోలాట నృత్యాలు తీన్మార్ డ్యాన్సులతో యువత ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొంది. విఘ్నేశా మళ్లీ ఏడాది రావాలి అంటూ వేడుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన శోభాయాత్రలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ పాల్గొన్నారు.

- నల్లగొండ కల్చరల్

అట్టహాసంగా శోభాయాత్ర

- ముగిసిన గణేష్ నవరాత్రోత్సవాలు
- స్వామి ప్రతిమకు నిమజ్జనం
- ఉత్సాహంగా పాల్గొన్న యువతీ, యువకులు
- నృత్యాలు, కోలాటాలు, డ్యాన్సులతో సందడి
- హాజరైన మంత్రి, కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆనందోత్సవాల నడుమ గణేష్ నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. నృత్యాలు, వాయిద్యాల దరువుల మధ్య చిన్నారులు, మహిళల, పురుషుల నృత్యాలు, కోలాట ప్రదర్శనలతో కన్నులపండువగా సాగింది. విచిత్ర వేషధారణల మధ్య గణేష్ శోభాయాత్ర శోభాయమానంగా ప్రశాంతంగా సాగింది. విఘ్నేశ్వరుడికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. సోమవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లోని మొదటి వినాయకుడి విగ్రహం మండపం వద్ద జరిగిన కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సీ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌లు హాజరై వినాయకుడికి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం లాంఛనంగా ఊరేగింపును ప్రారంభించారు. ఆ వినాయకుడి ప్రతిమను ప్రత్యేక వాహనంలో ఆసీనుడిని చేసిన తర్వాత శోభాయాత్ర అక్కడి నుంచి మొదలైంది. శాంతి సంఘం, గణేష్ ఉత్సవ సమితి, పోలీసు, రెవెన్యూ, వివిధ పార్టీల నాయకులు ముందుండి శోభాయాత్రను నడిపించారు. భక్తులు అడుగడుగునా వినాయకుడికి మంగళహారతులు పట్టారు. ప్రతీ విగ్రహం ఎదుట సాంస్కృతిక ప్రదర్శనలు సాగుతుండడంతో శోభాయాత్ర మందకొడిగా సాగింది. 10.30 గంటలకు మొదటి విగ్రహంతో ప్రారంభమైన శోభాయాత్ర వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకునేసరికి నాలుగు గంటలైంది. ఆవిధంగా ఇరువైపుల నుంచి వచ్చిన వినాయకుల విగ్రహాలు క్లాక్‌టవర్ మీదుగా వెళ్లి చిన్నవిగ్రహాలు వల్లభరావు చెరువులో, పెద్ద విగ్రహాలను 14వ మైలు రాయి వద్ద గల కాల్వలో నిమజ్జనానికి తరలించారు. ఎస్పీ, శాంతి సంఘం, ఉత్సవ సమితి సభ్యులు విగ్రహాల ఊరేగింపు సజావుగా సాగేందుకు దగ్గరుండి పర్యవేక్షించారు. మొదటి విగ్రహం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ దాటటంతో అధికారులందరూ ఊపిరిపీల్చుకున్నారు. విగ్రహాలన్నీ క్లాక్ టవర్ సెంటర్‌కు వరుస క్రమంలో ఊరేగింపుగా రావటంతో వాటిని తిలకించేందుకు పట్టణ ప్రజలు అధికసంఖ్యలో హాజరై కనులారా తిలకించి పరవశులయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా ప్రజలతో కిక్కిరిసిపోయింది. గణేష్ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో శాంతి సంఘం, ఉత్సవ సమితి, వివిధ పార్టీల నాయకులు వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్, కలీం, అప్పలప్రసాద్, గార్లపాటి వెంటయ్య, బండారు ప్రసాద్, గోలి మధుసూదన్ రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్, కట్ట సంపత్, ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, ఎండ్ల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, మల్లయ్య, పిల్లి రామరాజు, ఆర్డీవో రవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఇంతియాజ్, నేతి రఘుపతి, అల్లి సుభాష్ పాల్గొన్నారు.



రూ13.50 లక్షలకు లడ్డూను దక్కించుకున్న వర్షిత్‌రెడ్డి



రామగిరి: మొదటి వినాయకుడి విగ్రహం లడ్డు వేలం పాట ఆసక్తికరంగా సాగింది. వేలంలో నువ్వానేనా అన్నట్లుగా పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి అంజిరెడ్డిల మధ్య వేలం పాట సాగింది. చివరకు రూ13.50 లక్షలకు నాగం వర్షిత్‌రెడ్డి లడ్డూను కైవసం చేసుకున్నాడు. గత ఏడాది ఇక్కడి లడ్డూను రూ.36లక్షలకు కరుణ్‌జయ్‌రాజ్ కైవసం చేసుకున్నారు.

ప్రతి ప్రక్రియనూ పర్యవేక్షిస్తూ..

950 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు



ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నల్లగొండక్రైం, సెప్టెంబరు 16: నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథుడు 10వ రోజైన సోమవారం గంగమ్మ ఒడికి చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి సహకారంతో ముందస్తుగా ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. గణనాథుడి విగ్రహ ఏర్పాటు ముందు నుంచే పీస్ కమిటీతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు వారితో చర్చించి ఘర్షణలకు తావు లేకుండా ఉత్సవ కమిటీకి సూచనలు ఇస్తూ జిల్లా యంత్రాంగం తరుపున ఏర్పాట్లు చేసి ప్రశాంతంగా నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువుతో పాటు హాలియా 14వ మైలు, ఇతర గణేష్ నిమజ్జన ప్రదేశాలను కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షించి పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,831 వినాయక విగ్రహాలను ప్రజలు, భక్తులు ఏర్పాటు చేయగా నల్లగొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 9 ఫీట్ల లోపు విగ్రహాలను పట్టణంలోని పానగల్ సమీపంలో ఉన్న వల్లభరావు చెరువు వద్ద మూడు క్రేన్లతో పోలీసు సిబ్బంది బందోబస్తు నడుమ నిమజ్జనం చేశారు. అదేవిధంగా 9ఫీట్లకు పైబడిన విగ్రహాలను 14వ మైలు రాయి వద్ద పోలీసు బందోబస్తు నడుమ నిమజ్జనం చేశారు. ముందస్తు జాగ్రత్తలతో అర్ధరాత్రి వరకూ పోలీసుల బందోబస్తు మధ్య నిమజ్జనం చేశారు. అదేవిధంగా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పట్టణ కేంద్రంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు చేశారు. జిల్లావ్యాప్తంగా 950 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భద్రతను బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షణలో 2 ఏఎస్పీలు, 6 డీఎస్పీలు, 28 మంది సీఐలు, 70 మంది ఎస్ఐలు, 620 మంది ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఏఆర్ సిబ్బంది, 250 మంది ట్రైనీ మహిళ, పురుష కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు. నల్లగొండ పట్టణంతో పాటు దేవరకొండ, మిర్యాలగూడ, వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన 1600 సీసీ టీవీ కెమెరాలను ఆయా పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేసి గణేష్ శోభాయాత్రను 24 గంటలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.





కృష్ణమ్మ ఒడికి గౌరీ తనయుడు

- సాగర్ సమ్మక్క-సారక్క పుష్కరఘాట్ వద్ద నిమజ్జనాలు
- నిమజ్జనాలను పరిశీలించిన కలెక్టర్ , ఎస్పీ, డీఎస్పీలు

నాగార్జునసాగర్: వాడవాడలా తొమ్మిదిరోజులుగా పూజలందుకున్న గణపయ్య సోమవారం సాగర్ దయ్యాలగండి సమ్మక్క-సారక్క పుష్కరఘాట్ వద్ద కృష్ణమ్మ ఒడిలోకి చేరాడు. నాగార్జునసాగర్ కొత్త వంతెన వద్ద పోలీసులు భద్రత కారణాల దృష్ట్యా నిమజ్జనాలను నిషేధించడంతో దయ్యాలగండి వద్ద ఉన్న సమ్మక్క-సారక్క పుష్కరఘాట్ వద్ద సోమవారం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి తీసుకవచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ రాజశేఖర్ పరిశీలించారు. వారి వెంట సాగర్ సీఐ బీసన్న, సాగర్, పెద్దవూర ఎస్ఐలు సంపత్,వీరరాజు పాల్గొన్నారు.





వల్లభరావు చెర్వు వద్ద నిమజ్జనం

తెలంగాణ సాయుధ వీరులు విముక్తి ప్రదాతలు



సామాన్యుడు ఆయుధుడై
తిరగబడ్డ పోరాటం
తెలంగాణ సాయుధ పోరాటం.

ప్రపంచ చరిత్రలో పోరాటాలను
మేధావులు నడిపిస్తే భూమి కోసం,
భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి
విముక్తి కోసం ప్రజలే సారథులై
సాగించిన సమరం
తెలంగాణ సాయుధపోరాటం.

మేమొస్తున్నాం.. నిజాం ఏ
బండిలో పారిపోతావో అంటూ
..పాటల తూటాలను సంధించిన
గళాలను అందించిందీ
తెలంగాణ సాయుధ పోరాటం.

ఊరు, వాడా, పిల్లాజెల్లా ఎవరిదైనా
ఒకటే ఎజెండా, ఒకటే జెండా
తెలంగాణ విముక్తి.

ఆ పోరాటాల ఫలితమే
సెప్టెంబరు 17న నిజాం
నవాబు భారత ప్రభుత్వానికి
లొంగిన సందర్భం. ఈ
ప్రాంతానికి స్వేచ్ఛా
స్వాతంత్ర్యం లభించిన
శుభదినం.

తెలంగాణ సాయుధపోరులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అపూర్వ ఘటనలు, పోరాటయోధుల అనుభవాలు..

-7లో

పండుగ నిర్వహణలో జిల్లా ఆదర్శం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 16 : కులమతాలకు అతీతంగా అన్నివర్గాల పండుగలను ప్రశాంతంగా, సామరస్యంగా నిర్వహించుకోవడంలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ఆదర్శంగా నిలిచిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ మొదటి వినాయక విగ్రం వద్ద జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి హాజరైన సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసన సమావేశంలో మంత్రి మాట్లాడారు. 30 ఏళ్లుగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు ఐక్యంగా పండుగలను ప్రశాంతంగా, సామరస్యంగా జరుపుకోవడం తో మంచి వాతావరణం నెలకొందన్నారు. అందరూ మట్టి వినాయకవిగ్రహాలను నెలకొల్పి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఏ చిన్న ఇబ్బంది తలెత్తకుండా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పట్టణంలోని పలువార్డుల్లోని వినాయ మండపాలను సందర్శించి పూజలు చేశారు. కలెక్టర్ సీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు గణనాథుడు భక్తులచే పూజలందుకున్నారని, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది జరుగకుంటా మునిసిపల్ శాఖ, రెవెన్యూశాఖ, పోలీస్‌శాఖ కృషి చేశారని అన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో పోలీసులు నిరంతరం సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి కట్ట సంపత్, అప్పల ప్రసాద్, బండారు ప్రసాద్, జీవీ యాదవ్, అల్లి సుభాష్, ఎడ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

హాలియా, సెప్టెంబరు 16 : గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి కోరారు. సోమవారం హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 14వ మైలు వద్ద ఆయన ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి గణేష్ నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే చోట నీటిలో ప్రమాదం జరగకుండా విగ్రహాలు తీసుకువచ్చిన వారితో నిమజ్జనం చేయించకుండా, జిల్లా యంత్రాంగం ద్వారా ఏర్పాటుచేసిన వారి ద్వారానే నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జనం నిర్వహించే చోట గజఈతగాళ్లతో పాటు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, విధులకు నియమించబడిన అన్ని శాఖల ఉద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స కిట్లతో పాటు, ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రదేశంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పారిశుధ్య సిబ్బంది ఎప్పటికిప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలెక్టర్, ఎస్పీ వెంట తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో సుజాత, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, సీఐ జనార్ధన్‌గౌడ్, ఏఈ బాలునాయక్, డాక్టర్ రామకృష్ణ, ఎస్.ఐలు సతీష్‌రెడ్డి, గోపాల్‌రావు, ప్రసాద్ ఉన్నారు.



14వ మైలురాయి వద్ద కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

'ఉపాధి' సందేహాలకు

యాప్‌తో నివృత్తి

- 'జన్‌మన్‌రేగా' పేరుతో ప్రత్యేక యాప్
- కూలీల ప్రతీ వివరాలు అందులోనే..
- పనిదినాలు, వేతనాల వివరాలు ఇక మొబైల్‌లో అందుబాటులో..



ఉపాధికూలీల సందేహాలకు ప్రత్యేక యాప్ నివృత్తి చేస్తోంది. ఉపాధి పథకం వినియోగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న కేంద్రం కూలీల కోసం 'జన్ మన్‌రేగా' పేరిట ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. కూలీల పనిదినాలు, వేతనాలు, వేతనం ఆలస్యం వివరాలు, ఏ బ్యాంక్‌లో జమ చేసిన వివరాలను తెలుసుకునే అవకాశం కలిగింది. ఇప్పటి వరకు ఈ వివరాలు కోసం అటు బ్యాంక్, పోస్టాఫీసుల చుట్టూ కూలీలు తిరిగేవారు. ఇక చేతిలోని మొబైల్ ఫోన్ నుంచే ఆ వివరాలను ఇట్టే తెలుసుకోవచ్చు. అయితే యాప్ వినియోగంపై కూలీలకు సరైన అవగాహన కల్పించకపోవడంతో వినియోగంలోకి రాకుండాపోయింది. ప్రస్తుతం కూలీలకు ప్రత్యేకంగా యాప్‌పై అవగాహన కల్పించాలని ఆదేశాలిచ్చినట్లు అధికారులు తెలిపారు.

మిర్యాలగూడ అర్బన్

-7లో

'ప్రజాపాలన' దినోత్సవానికి పరేడ్ మైదానం ముస్తాబు

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 16 : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని అధికార యంత్రాంగం సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసింది. మంగళవారం నిర్వహించే ప్రజాపాలన దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో మైదానాన్ని తీర్చిదిద్దారు. ఈ వేడుకలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం ప్రసంగించనున్నారు. 10.30 గంటలకు పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, జాతీయ గీతాలాపన చేయనున్నారు. అందుకు సంబంధించి అన్నిఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు.



నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో ముస్తాబవుతున్న వేదిక

20న డిప్యూటీ సీఎం రాక

ఎస్ఎల్‌బీసీ సందర్శనకు ఏర్పాట్లు : ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 16: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ నెల 20న శ్రీశైలం సొరంగమార్గం(ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును సందర్శించనున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు వద్ద హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఎస్ఎల్‌బీసీ పనులు త్వరగా పూర్తిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మంత్రులతో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్

దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర, సెప్టెంబరు 16: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశపరీక్షకు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించామన్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోరే అభ్యర్థులు ప్రస్తుతం 5వ తరగతి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే చదువుతూ ఉండటంతో పాటు, అభ్యర్థుల తల్లిదండ్రులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారికే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకుగాను ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ధ్రువీకరణ పత్రం, ఫొటోతో దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తిప్పర్తి, సెప్టెంబరు 16: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెం దాడు. ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని పాతపల్లి గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పాతపల్లెకు చెందిన షేక్ కఫీర్ (39) నల్లగొండ పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం నల్లగొండ పట్టణం నుంచి తన స్వగ్రామం పాతపల్లెకు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో పాతపల్లె క్రాస్‌రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి మిర్యాలగూడెం వైపునకు వెళ్తున్న టీఎస్ 07 జెఎస్ 1158 అనే నెంబరు గల కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ కఫీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆ సుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆ సుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక పరీక్ష నిర్వహించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో రాత్రి 12గంటల సమయంలో తిరిగి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కఫీర్‌కు భార్య హఫీజాతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి బావమరిది అహ్మద్‌పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సింగం రాంమూర్తి తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన వాహనం

- ప్రమాదంలో ముగ్గురికి గాయాలు
- ఎస్పీ కాన్వాయ్‌లో ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

కనగల్, సెప్టెంబరు 16: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎస్పీ గమనించి ఆయన కాన్వాయ్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని తేలకంటిగూడెం స్టేజీ సమీపంలోని టోల్‌గేట్ వద్ద చోటు చేసుకుంది. సోమవారం ఆటోను, టాటా ఏస్ వాహనం వెనుకనుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. అదే సమయంలో హాలియా నుంచి నల్లగొండకు వస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్ తమ కాన్వాయిని పక్కకు నిలిపి క్షతగాత్రులను రక్షించే ప్రయత్నం చేశారు. ఆలస్యం లేకుండా వెంటనే ఎస్పీ తన కాన్వాయి వాహనంలోకి గాయపడిన వారిని ఎక్కించి చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గణేష్ మండపంలో 9 కేజీల లడ్డూ చోరీ

కేతేపల్లి, సెప్టెంబరు 16: గణేష్ మండపంలో వినాయకుడి చేతిలో ఉన్న 9 కిలోల లడ్డూను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో ఈ సంఘటన జరిగింది. మండప నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట జేజే ఫ్యాబ్రికేషన్స్ యజమాని సంకోజు జేజయ్య తన ఇంటి ఎదుట సర్వీసు రోడ్డుపై గణేష్ నవరాత్రోత్సవాల నిర్వహణ కో సం మండపం ఏర్పాటు చేసి వినాయక విగ్రహాన్ని పెట్టి పూజలు చేస్తున్నా రు. వినాయకుడి చేతిలో దాదాపు రూ.6వేల విలువైన 9 కిలోల లడ్డూను పెట్టి నిత్యం పూజలు చేస్తున్నారు. ఈ మండపం వద్ద నిత్యం ఇరువురు యువకులు నిద్రిస్తుంటారు. ఆదివారం రాత్రి మండప ముఖ ద్వారానికి అడ్డుగా పెట్టిన ఫ్లెక్సీతో కూడిన తలుపును తీసిన ఆగంతకులు లోపలకు వెళ్లి వినాయకుడి చేతిలోని లడ్డూను అపహరించారు. సోమవారం ఉద యం మండపంలో శుభ్రం చేస్తూ వినాయకుడి చేతిలో లడ్డూ లేకపోవడా న్ని గమనించిన నిర్వాహకులు ఆశ్చర్యపోయారు. లడ్డూను ఎంత వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు వివరాలు సేకరించారు.



తరతరాల బానిసత్వానికి, నిజాం, రజాకార్ల పాలన నిరంకుశత్వానికి నిరసనగా సాగించిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం. మట్టి మనుషులను సైతం మహాయోధులుగా మార్చిన ఘనత తెలంగాణ సాయుధ పోరాటానికి ఉంది. తమ ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి పోరాడిన యోధులు ఎందరో.....వారి త్యాగాలు చిరస్మరణీయం. నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరులు ఎందరో... రజాకార్ల దురాగాతాలను అంతమొందించేందుకు మండలంలో ఎంతో మంది పోరాడి అమరులైయ్యారు.

- చిట్యాల రూరల్

రణభూమి రాచకొండ

రజాకార్లను తరిమిన కమ్యూనిస్టు వీరులు

చౌటుప్పల్, సెప్టెంబరు 16: నిజాం నిరంకుశ పాలనపై సాగిన నాటి వీర తెలంగాణ విప్లవ రైతాంగ సమాయుధ పోరాటయోధులకు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని రాచకొండ గుట్టలు వేదిక అయ్యాయి. 1947 ఆగస్టు 15 దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు మాత్రం స్వాతంత్ర్యం రాలేదు. తెలంగాణ ప్రాంతాన్ని పాలించే నిజాం నవాబు తెలంగాణ సంస్థానాన్ని స్వతంత్రంగా ఉంచాలని భావించాడు. అతడి తొత్తులైన దొరలు, భూస్వాములు సామాన్యులను పీడించ సాగారు. స్థానిక దొరలకు రక్షణగా నిజాం నవాబు నరరూప రాక్షసుడైన కాశీం రజ్వీ ప్రైవేటు సైనాన్ని పంపించాడు. కాశీం రజ్వీ సైన్యమే రజాకార్లు అని పిలవబడ్డారు. ప్రజల ధనమాన ప్రాణాలను దోస్తూ అరాచకాలు సృష్టించారు. ఈ క్రమంలోనే కమ్యూనిస్టులు గెరిల్లా దళాలు ఏర్పడ్డారు. దొడ్డి కొమరయ్య అమరత్వం, విస్నూరు దొరలపై చాకలి ఐలమ్మ, భీంరెడ్డి నర్సింహారెడ్డి తిరుగుబాటు చరిత్రపుటల్లోకి ఎక్కాయి. తెలంగాణలోని ప్రతీ పల్లె పోరాట పొలికేక అయ్యింది.

సాయుధ పోరాటానికి కేంద్రం రాచకొండ

తె ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రజాకారులపై దాడి జరిపిన సాయుధ రెరిల్లా దళాలు రాచకొండ గుట్టలోనే తల దాచుకునేవి. సాయుధ పోరాట యోధులైన కేవీ కృష్ణమూర్తి, ధర్మ బిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లాంటి పోరాటయోధులు ఈ గుట్టలలోనే ఉద్యమాలకు వ్యూహ ప్రతి వ్యూహాలు రచించారు. రాచకొండలోని నిహల్దాం పహాడ్ ప్రాంతంలో బొమ్మగోని ధర్మబిక్షం నాయకత్వంలో వందలాది ఎకరాల్లో ఎర్రజెండాలు పాతి భూమిలేని పేదలు భూములను ఆక్రమించుకున్నారు. మం డలంలోని పుట్టపాక కేంద్రంగా రజాకారులు సాగించిన అరాచకాలను కమ్యూనిస్టు దళాలు ప్రతిఘటించాయి. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు నాయకులైన నంద్యాల శ్రీనివాసరెడ్డి జంగారెడ్డి ఎలమంద తదితరుల నాయకత్వంలో పుట్టపాకలోని రజాకార్ల క్యాంపుపై కమ్యూనిస్టులు దాడి చేశారు. రజాకార్లను వారు ఉంటున్న ఇంట్లోనే బంధించి, ఆ ఇంటిని తగలబెట్టి రజాకారులను అంతమొందించారు. మండలంలోని వావిళ్ళపల్లి గ్రామంలో జరుగుతున్న రజాకార్ల అరాచకాలను ఎండగట్టేందుకు కమ్యూనిస్టు దళాలు వ్యూహాలు పన్నాయి. గ్రామాన్ని దోచుకునేందుకు వచ్చిన రజాకార్ల గుంపుపై కమ్యూనిస్టు దళాలు దాడి చేసి రజాకార్లను అంతమొందించాయి. రజాకార్లను పూర్తిగా అంత మొాదించాలన్న ఉద్దేశంతో సాయుధ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న నాయకులు రాచకొండ గుట్టల్లో ప్రత్యేక సమావేశం అయ్యారు. సాయుధ దళాలకు అన్నం పెట్టిన వాడే ద్రోహం తలపెట్టాడు. రాచకొండ గుట్టలో సాయిధ ఉద్యమకారులు సమావేశమయ్యారన్న సమాచారాన్ని యూనియన్ మిలటరీ సైన్యానికి సమాచారం ఇచ్చాడు. దీంతో మిలటరీ సైన్యం రాచకొండ గుట్టలను చుట్టుముట్టాయి. అప్పటి సాయుధ గేరెల్లా యోధులైన డాక్టర్ రాజు బహదూర్ గౌడ్, సీతారామరెడ్డి, రామచంద్ర రెడ్డి, కృష్ణమూర్తిలు సైన్యం చేతికి చిక్కారు. వారిని నెల రోజులపాటు చిత్రహింసలకు గురి చేశారు. గుత్తా సీతారాంరెడ్డి, పైల రామచంద్రారెడ్డిలను రాచకొండ గుట్టలోకి తీసుకుపోయి కాల్చి చంపారు. ఉద్యమకారుల రక్తంతో ఈ ప్రాంతం మరింతగా ఎరుపెక్కింది.

మోత్కూరు పోతుగడ్డ

మోత్కూరు, సెప్టెంబరు 16: మోత్కూరులో నిజాం కాలం నుంచే పోలీస్‌స్టేషన్ ఉంది. మోత్కూరు ప్రాంతంలోనూ దొరలు, రజాకార్లు నిజాం ప్రభువు ఏజంట్లుగా ఉండి ప్రజలను పీడించేవారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించి రజాకార్ల, దొరల అకృత్యాలను, వారిని (రజాకార్లను, దొరలను, నైజాం పోలీలసులను) రైతాంగ సాయుధ దళాలు ఎదిరించిన విధానాలను ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాలు పంచుకున్న కాచం కృష్ణమూర్తి, కట్కూరు రామచంద్రా రెడ్డి, దూదిపాల చిన్నసత్తిరెడ్డి, కూరెల్ల సంజీవ రెడ్డి తదితరులు ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం రగిలించారు. గుండాల, పెద్దపడిశాల, వస్తకొండూరు, సుద్దాల, మరిపడిగ గ్రామాల్లో సంఘాలు ఏర్పడ్డాయి. నాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దళాలు కొండగడప దేశ్‌ముఖ్ గడిపై దాడి చేశాయి. ఆ విషయం తెలుసుకున్న మోత్కూరు దేశ్‌ముఖ్ హైద్రాబాదు వెళ్లిపోయాడు. హైద్రాబాదు సంస్థానం భారత్‌లో విలీనం అయిన తర్వాత మళ్లీ మోత్కూరు తిరిగి వచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో మోత్కూరులో ఉన్న ఎస్ఐ గడ్డం అమీన్ దొరలకు, రజాకార్లకు అండగా నిలుస్తూ ప్రజలను, సాయుధ రైతాంగ పోరాట నాయకులను హింసించేవాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దళాలు పోలీస్ స్టేషన్లపై దాడులు జరిపి ఆయుధాలు సమకూర్చుకునేవి. 1947లో సింగారం రాజయ్య, గాదె రాజు నల్లగొండ కోర్టుకు వెళ్లి వస్తుండగా రజాకార్లు మోత్కూరు బిక్కేరు వాగులో వారిని అడ్డగించి వారితోనే గుంత తీయించి అందులో నిలబెట్టి సగం పూడ్చి తుపాకితో కాల్చి చంపారు. ప్రతీకారంగా కమ్యూనిస్టు యోధులైన నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి దళం మోత్కూరు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి అక్కడ తలదాచుకున్న భూస్వామిని కాల్చితే చెయ్యి తెగి స్టేషన్‌లోనే మృతి చెందాడు. దస్తగిరి అనే పోలీసును వారు పట్టుకుని చెట్టుకు కట్టేసి కొట్టగా అతని నడుము చుట్టూ సుమారు వంద పుస్తెలు దొరికాయి. అవి వాడు ఊళ్ల మీద పడి మహిళలను చెరిచి లాక్కొచ్చిన పుస్తెలుగా చెప్పేవారు. అతన్ని కూడా చంపారు. గడ్డం అమీన్‌ను కూడా సాయుధ దళాలు మట్టుబెట్టి, ప్రజారాజ్యాన్ని సస్థాపించాయి.

ఆరుట్ల దంపతుల పోరాటం



ఆలేరు రూరల్, సెప్టెంబరు 16: ఆలేరు మట్టి పరిమళాలను ఎరుపెక్కించి దేశ వ్యాప్తం చేసిన పోరాట యోదులు ఆరుట్ల దంపతులు మట్టి మనుషులను మహోన్నతులుగా మార్చిన ఘనత ఆలేరుది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరు పోషించిన పాత్ర కొనియాడదగినది. నిజాం నిరంకుశ పాలనను అంతం చేయాలన్నది. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాడాలనే లక్ష్యంతో కదన రంగంలో దూకి చావును ముద్దాడిన వీరులు పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలిచిన ఆనాటి సాయుధ పోరాటంలో భార్యభర్తలిద్దరూ ఒకే లక్ష్యం కోసం జెరిల్ల సాయుధులై నిలబడడం అరుదు. తమ జీవితాలను ఒక ప్రయోగశాలగా మార్చి విప్లవాలతో ప్రజలను చైతన్యం చేసిన ఆరుట్ల కమలాదేవి 1952 నుంచి 1964 వరకు 3 సార్లు ఆలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆరుట్ల రాంచంద్రా రెడ్డి 1952లో మెదక్ జిల్లా రామాయణం పేట ఎమ్మెల్యేగా, 1968లో భువనగిరి ఎమ్మెల్యేగా పని చేసి 1985లో అమరత్వం చెందారు. 1964లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభలో మహిళా ప్రతిపక్ష నేతగా ఉంటూ దేశంలోనే గొప్ప చరిత్రను సృష్టించింది కమలాదేవి. అక్షరాలు మట్టి మనుషులను మహోన్నతులుగా మారుస్తాయన్న ఆమె 1 జనవరి 2001న అమరులయ్యారు. వీరే గాక ఏసిరెడ్డి నర్సింహారెడ్డి, కట్కూరి రాంచంద్రారెడ్డి, కట్కూరి సుశీలాదేవి, ధుంపల మల్లారెడ్డి, బంద్రు నర్సింహులు, కొండం నర్సిరెడ్డి, లాంటి వీరుల త్యాగం వారి పోరాట ప్రతిమ మరువలేనిది.

అమరుడు కోదండరాంరెడ్డి



బీబీనగర్, సెప్టెంబరు 16: విప్లవ ఉద్యమ చరిత్రలో తెలంగాణ విముక్తి ఉద్యమం సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఘట్టం. స్వదేశ రాచరికం, దౌర్జన్య పూరిట భూస్వామ్య విధానాలు, నిజం, నిరంకుశ పాలన వ్యతిరేకంగా తెలంగాణ పీడిత ప్రజలు నిర్మించి విజయం సాధించిన సాయుధ పోరాటంలో కొమ్మిడి కోదండరాంరెడ్డి మణిపూస అని చెప్పవచ్చు. బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని భూస్వామ్య కుటుంబానికి చెందిన కొమ్మిడి కోందడరాం రెడ్డి సంస్థాన్ విముక్తి పోరాటంలో పాల్గొన్నారు. 1941నుంచి ఆంధ్రమహాసభ్యుడిగా కార్యకర్త, గాయత్రిగా, కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగి అత్రాఫ్ పల్దాజిల్లాల శత్రు వర్గాలకు సింహస్వప్నంగా ఎదిగారు. 1944లో భువనగిరిలో నిర్వహించిన 11వ ఆంధ్రమహాసభ నిర్వహణలో కోందడరాంరెడ్డి పాత్ర కీలకమైనది. రజాకార్లు గ్రామాలకు వస్తే అందుబాటులో ఉన్న ఆయుధాలతో తిరగబడాలని ప్రజలను చైతన్యం చేశారు. రజాకారులను ఎదుర్కొనేందుకు కోదండరాంరెడ్డి 80మందిలో జైత్రయాత్ర దళాన్ని ఏర్పాటు చేశారు. బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామంలో మహ్మద్ ఖాజీ దళ సభ్యులను పట్టి పోలీసులకు అప్పగించినందుకు కోదండరాంరెడ్డి నుంతనపల్లిలో 60మంది రజాకారులపై మూకుమ్మడిగా దాడి చేసి ప్రతీకారం తీర్చుకున్నారు. గోకారంలో షేక్ అలీ అనే రజాకారుడి నాయకుడిని అంతం చేశారు. గుండ్రాంపల్లి గ్రామంలో 50మంది రజాకారుల క్యాంపు ఏర్పాటు చేసుకోగా కోదండరాంరెడ్డి నాయకత్వంలోని 150మంది దళ సభ్యులు 1000మంది ప్రజల సహకారంతో అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో దాడి చేసి వారిని మట్టుపెట్టారు. 1949 జూన్ 6న బ్రాహ్మణపల్లి గ్రామ శివారు మంగలోని బావి వద్ద 27ఏళ్ల ప్రాయంలోనే రజాకార్ల చేతిలో వీర మరణం పొందాడు.

రజాకార్లను తరిమిన గడ్డ 'గుండ్రాంపల్లి'

రజాకార్ల పైశాచికానికి పోరాట యోధులు బలి



నిజాం రజాకార్ల రాక్షస కృత్యాల నుంచి 1948 సెప్టెంబరు 17వ తేదీన తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిన రోజు. రజాకార్ల కబంధహస్తాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి అమరవీరులు ఎన్నో పోరాటాలు చేశారు. రజాకార్ల దురాగాతాలు, అరాచకాలను అడ్డుకునేందుకు వారు ఏర్పాటు చేసుకున్న క్యాంపులపై కమ్యూనిస్టు పార్టీ ప్రజాదళాలు స్వేచ్ఛకోసం నెత్తురును చిమ్మించాయి. అలాంటి పోరాటయోధులను కన్నతల్లి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి. గుండ్రాంపల్లిలో తెలంగాణ సాయుధ పోరాటాల్లో పాల్గొన్న యోధులను చాలామందిని చంపి బావిలో పూడ్చేశాడు రజాకార్ల నాయకుడు సయ్యద్ మక్బూల్. అనంతరం ఆ బావిని అమర వీరుల స్థూపంగా ఏర్పాటు చేసుకుని గుండ్రాంపల్లి వాసులు చరిత్రను మననం చేసుకుంటున్నారు. బావిలో పూడ్చివేయబడిన వారిలో 26 మందిని గుర్తించగలిగారు. అమరవీరుల స్థూపాన్ని గుండ్రాంపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన 1993 జూన్ 4వ తేదీన ఏర్పాటు చేశారు. 2010లో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అమరవీరుల స్థూపాన్ని తొలగించబడగా రహదారి పక్కన ఏపూర్ గ్రామానికి వెళ్లే దారిలో మసీద్‌కు ఎదురుగా స్థూపాన్ని నిర్మించారు.

నంద్యాల అనుచరునిగా ఉద్యమించిన లచ్చయ్య



మిర్యాలగూడ రూరల్: మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన పెద్దారపు లచ్చయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి అనుచరునిగా ఉద్యమంలో పాల్గొన్నారు. నిజాం అరాచకాలను తట్టుకోలేక పోరాటంలో భాగస్వామి అయ్యాడు. లచ్చయ్య 1947 వరకు ఉద్యమంలో పాల్గొన్నాడు. తెలంగాణలో నైజాం పాలన కొనసాగుతుండగా ఆంధ్రలో బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కలగడంతో విజయవాడకు వెళ్లాడు. రిక్షావాలాగా జీవనం సాగిస్తున్న లచ్చయ్యను పోలీసులు పట్టుకొచ్చి మిర్యాలగూడ సబ్ జైలు, నల్లగొండలో పది నెలల జైలు జీవితం గడిపాడు.

రజాకార్లపై పోరాడిన వల్లాల యువకులు

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వల్లాలలో 1948 ఆగస్టు 15వ తేదీన వల్లాల స్కూల్‌లో విద్యార్థులు జాతీయజెండా ఎగురవేశారు. విషయం తెలుసుకున్న రజాకార్లకు జెండా ఎగురవేసిన వారిని పట్టుకున్నారు. 1948 సెప్టెంబరు 16వ తేదీన జెండా పాతిన 10మంది విద్యార్థులను పట్టుకొచ్చి అదే ప్రదేశంలోనే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. అబ్దుల్ ఖాదర్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలను ఏకం చేసి రజాకార్లను వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు.

దళాలకు అడ్డాగా దేవరకొండ ప్రాంతం

దేవరకొండ/డిండి: భూమి కోసం, భుక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నైజాంకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మైనుద్దీన్, బొమ్మగాని ధర్మబిక్షంలకు దేవరకొండ ప్రాంతం అడ్డాగా ఉండేది. దేవరకొండ మండలం పద్మట్‌పల్లి, డిండి మండలం కందుకూరు, రామంతపూర్, చింతపల్లి మండలం గౌరారంతో పాటు పలు గ్రామాలు కమ్యూనిస్టుల ఆధీనంలో ఉండేవి. పల్లా పర్వత్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావు, రామశర్మ, బందగీలు సాయుధ పోరాట యోధులకు భోజనం, బస, వసతులు కల్పించి ప్రోత్సహించేవారు. డిండి మండలంలోని టి.గౌరారం గ్రామానికి చెందిన దివంగత నల్లగాసు బాలయ్య, నర్సింహారెడ్డి, చందంపేట మండలంలోని కాచరాజుపల్లికి చెందిన బొమ్ము ఇద్దయ్య, నేతాళ్ల ఎల్లయ్య, బీంరెడ్డి నర్సింహారెడ్డి దళంలో సభ్యులుగా ఉండేవారని కుటుంబ సభ్యులు తెలిపారు.

'బాలెంల' పోరాటం. చరిత్రాత్మకం

తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామస్థులు తరిమికొట్టారు. 1946 అక్టోబరు 18వ తేదీ తెల్లవారుజామున నిజాం సైన్యం గ్రామాన్ని చుట్టు ముట్టింది. గ్రామానికి చెందిన రైతులు గార్లపాటి అనంతరెడ్డి, పటేల్ మట్టారెడ్డి, సుంకు రంగయ్యతో పాటు మరి కొంతమందిపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టారు. రైతులు ఎదురుతిరిగి పోరాడారు. ఆ దాడిలో పటేల్ మట్టారెడ్డి, గార్లపాటి అనంతరెడ్డి వీరమరణం పొందారు. గ్రామస్థులందరూ .పోలీసులకు తరిమికొట్టారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా ఏర్పడిన వరవర రంగనాయక బాషా నిలయం.


- సూర్యాపేటరూరల్, కోదాడ రూరల్, హుజూర్‌నగర్, గరిడేపల్లి



నిజాం నవాబు దురగతాలకు వ్యతిరేకంగా 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం సాగిందని దీన్నే తెలంగాణ విద్రోహ దినమే నేడు విమోచన దినంగా పిలుస్తారని, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బాదె నర్సయ్య అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో ప్రజా నాట్య మండలి కళాకారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ ప్రాంతం నిజాం నవాబు సంస్థానంలో ప్రజలకు స్వాతంత్ర్యం రాలేదని. నిజాం నిరంకుశత్వానికి వివిధ సంఘాలు, రచయితలు ఇబ్బంది పడ్డారన్నారు. ఆనాడు నిజాం నవాబు ఉసిగొల్పిన రజాకార్లు గ్రామాలపై పడి అనేక అరాచకాలు చేయడంతో పాటు కీతవారిగూడెంలోని సూరలదేవి చెరువులో కొంత మంది మహిళలను బలత్కారం చేశారన్నారు. ఈ విషయం కమ్యూనిస్టు ఉద్యమకారులకు తెలియడంతో అదే రోజు సాయంత్రం 15మంది రజాకార్లను మట్టు బెట్టారన్నారు. అందుకు ప్రతీకారంగా రజాకార్లు ఊరికి నిప్పు పెట్టారన్నారు. రజాకార్ల ఆగడాలును తుద ముటించాలని ఆనాటి కమ్యూనిస్ట్‌ల ఆధ్వర్యంలో సాగిన పోరాటంలో ఈ ప్రాంతం నుండి వెలిదండ, రంగాపురం గ్రామాలకి చెందిన యువకులు అమరులయ్యారని, ఎంతోమంది గాయపడ్డారన్నారు. కొంత మంది జైలు జీవితం అనుభవించారన్నారు.. ఆనాడు జరిగిన దురాగతాలకు గ్రామాలకు గ్రామాలు ఏకమై పోరాటలు చేశారని ఆయన అన్నారు.

నైజాం వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట సమయంలో కోదాడ మండలం గణపవరం గ్రామంలో వర వర రంగనాయక భాషా నిలయాన్ని స్వాతంత్ర్య సమరయోధుడు తడకమల్ల రాఘవరావు 1952లో ప్రారంభించారు.స్వాతంత్య సమరయోధులుగా నిలయంగా గణపవరం ప్రసిద్ధిగాంచింది. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఈ గ్రామానికి చెందిన జాబిశెట్టి చంద్రయ్య, వెంకట అప్పిరెడ్డి, రామయ్యవరదారెడ్డి, గురునాథం కీతారపు బసవయ్యలతో పాటు ఎందరో అమరులయ్యారు. ఈ పోరాటంలో హుజూర్‌నగర్‌కు చెందిన దొంతిరెడ్డి శంభిరెడ్డి, మఠంపల్లికి చెందిన బొమ్మకంటి గోపయ్య, పొనుగోడుకు చెందిన దాసరి లింగన్నలు రజాకార్ల చేతిలో ప్రాణాలు కోల్పోయారు. దొంతిరెడ్డి శంభిరెడ్డి తండ్రిని కూడా నిజాం పోలీసులు తీవ్రంగా గాయపర్చారు. తెలంగాణ సాయుధ పోరాట దళంలో హుజూర్‌నగర్‌కు చెందిన చింతలపూడి రాములు, ఆయన సోదరి కోట తిరుపతమ్మ పశ్య రామిరెడ్డి పనిచేశారు.1947లో నిజాం ప్రభు త్వం లెవీ ధాన్యాన్ని మఠంపల్లి ప్రాంతం నుంచి హుజూర్‌నగర్‌కు 100 బండ్లపై తరలిస్తుండగా శంభిరెడ్డి, చింతలపూడి రాములు, పశ్య రామిరెడ్డిల ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఎర్రగట్టు గ్రామ శివారులో ధాన్యాన్ని ప్రజలకు పంచేందుకు ప్రయత్నించారు. నిజాం పోలీసులు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి వెళ్లిపోయి, ఆ తర్వాత నుంచి ఉద్యమకారులను పోలీసులు వేధించసాగారు. ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటాన్ని నిలిపివేయాలని ఎంతోమందిని రజాకార్లు చంపేశారు.

ఉపాధి కూలీల సందేహాలకు...
యాప్‌తో నివృత్తి



మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 16 : గ్రామీణ ప్రాంతకూలీల వలసలను అరికట్టేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. 2006 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం వినియోగంలో అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. కూలీలకు పనికల్పన మొదలు హాజరు నమోదు, వేతనాల చెల్లింపు వరకు పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనికి తోడు ఉపాధిహామీ పథకం కింద పనులకు హాజరైన కూలీల వేతనాలకు సంబంధించిన వివరాలను తెలుసుకునేలా తాజాగా 'జన్‌మన్‌రేగా' యాప్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా వినియోగంలోని తెచ్చింది. పనుల నిర్వాహణ, అమలు, వేతనాల చెల్లింపు వివరాలను కూలీలు నేరుగా తెలుసుకునేలా యాప్‌ను రూపొందించారు. కూలీల హాజరు నమోదులో పారదర్శకత, అవినీతి, అక్రమాలను పసిగట్టే అవకాశం కల్పించింది. పనులకు హాజరైన కూలీలు తమ వేతనాల వివరాలను తెలుసుకునేందుకు ఈజీఎస్ కార్యాలయం, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో కూలీలకు అక్కడ సరైన సమాధానం లభించక ఇబ్బందిపడుతున్నారు. గత ఏడాది కేంద్ర తనిఖీ బృందం కూలీలు ఎదుర్కొంటున్న పలు అంశాలను అధ్యయనం చేసి పరిష్కారమార్గం కోసం జరిపిన అన్వేషణలో భాగంగా 'జన్‌మన్‌రేగా' యాప్ రూపం దాల్చింది. దీంతో కూలీలు అధికారుల, సిబ్బందిని నేరుగా కలువకుండానే తమ స్మార్ట్‌ఫోన్ ద్వారా చేసిన పని రోజులు, జమ చేయబడ్డ వేతనాల వివరాలు ఇక నుంచి అరచేతిలో కనిపిస్తాయి.

తొలగనున్న సంశయం

ఉపాధిహామీ పథకం కింద ఉమ్మడి జిల్లాలో నిత్యం వందలాది మంది కూలీలు, వ్యవసాయ కార్మికులు పనులకు హాజరవుతున్నారు. సాధారణంగా వేసవి రోజుల్లో పథకానికి విశేష ఆదరణ లభిస్తోంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ దఫా కూలీల హాజరుశాతం, పనిదినాల కల్పన మరింతగా మెరుగుపడింది. అయితే కూలీలు చేసిన పనులకు సంబంధించి జమ చేయబడ్డ వేతనాల వివరాలను తెలుసుకునేందుకు బ్యాంకులు, పోస్టాఫీసుల వద్దకు వెళ్లక తప్పడంలేదు. పని ఒత్తిడి కారణంగా బ్యాంకు సిబ్బంది కూలీల వేతనాల వివరాలను తెలిపేందుకు సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో తమ వేతనాలు పడ్డాయా, లేదా అనే సంశయం వారిలో నెలకొనేది. సమచార లోపంతో తమ ఖాతాలో జమ చేసిన వేతనాలను విత్‌డ్రా చేసుకుని అవసరానికి తగ్గట్టు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. కొత్తగా వినియోగంలోకి వచ్చిన 'జన్‌మన్‌రేగా' యాప్‌తో ఉపాధిహామీ సమాచార చిక్కులకు గుగుల్ ప్లేతో చెక్‌పడింది.

సులభంగా యాప్ డౌన్‌లోడ్

గుగుల్‌ప్లే ద్వారా సులభతరంగా 'జన్‌మన్‌రేగా' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లో కూలీల హాజరు, నగదు జమ విభాగాలపై నొక్కితే సంబంధిత వివరాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. యాప్ ఓపెన్ చేసి కనిపించే కాలంలో రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామపంచాయతీ వివరాలను నమోదు చేసి ఉపాధిహామీ జాబ్‌కార్డు నెంబర్ అప్‌లోడ్ చేసిన వెంటనే కుటుంబసభ్యుల వివరాలు కనిపిస్తాయి. వారిలో పనులకు హాజరైన కూలీ పేరుపై నొక్కితే పనివివరాలు, జమ చేసిన వేతనాలు కనిపిస్తాయి. 2023 నుంచి కూలీల వివరాలు చూసుకునేలా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ యాప్‌ను రూపొందించింది. అదేవిధంగా కూలీల హాజరు, వేతనాల జమ కాకపోవడానికి గల కారణాలు సైతం 'జన్‌మన్‌రేగా' యాప్‌లో తెలుసుకోవడంతోపాటు, వేతనాలు ఏ బ్యాంకులో జమ చేశారన్న వివరాలు కూడా కనిపిస్తాయి. దీంతోపాటు స్థానికంగా జరిగే అక్రమాలపై నేరుగా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు ఫిర్యాదు చేసేలా యాప్‌లో అవకాశం కల్పించారు. అయితే గత ఈ ఏడాది ఏప్రిల్ నుంచి యాప్ వినియోగంలో అమల్లోకి వచ్చినప్పటికీ కూలీలకు అవగాహన కొరడి సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. దీంతో కూలీలు తమ హాజరు నమోదు, వేతనాల వివరాలను తెలుసుకునేందుకు కార్యాలయాలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆశ్రయించాల్సి వస్తోంది. యాప్ వినియోగంపై అవగాహన కొరవడ్డ నేపథ్యంలో ఈ పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది.

ఉమ్మడిజిల్లాలో జాబ్‌కార్డులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 8,78,659 కుటుంబాలు ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. 19,77,973మంది కూలీల వివరాలు నమోదై ఉన్నాయి. వారిలో 10,06,078మంది పురుషులు, 9,71,895మంది స్త్రీలు ఉన్నారు.

- నల్లగొండజిల్లాలో 4,05,263 జాబ్‌కార్డుల్లో 9,24,947మంది కూలీలు ఉండగా, ఈ ఏడాది 5,,12,082మంది కూలీలు పనులకు హాజరయ్యారు.
- సూర్యాపేట జిల్లాలో 2,97,375జాబ్‌కార్డుల్లో 6,82,153మంది కూలీలకు 3,94,818మంది పథకాన్ని వినియోగించుకున్నారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,76,021జాబ్‌కార్డులుండగా, 3,70,873మంది కూలీలు నమోదై ఉండగా ఈ ఏడాది 2,01,953మంది ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ప్రస్తుతం 10కూలీలకు ఒక ఈ-మస్టర్ రోల్ అందిస్తున్నారు. వారిలో విద్యావంతులై ఉండి స్మార్ట్‌ఫోన్ వినియోగం తెలిసినవారికి 'జన్‌మన్‌రేగా' యాప్ వాడకం గురించి అవగాహన కలిపిస్తే పథకం వివరాలను సమగ్రంగా తెలుసుకునే అవకాశం దక్కుతుంది. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాల్సిన ఆవసరం ఉందని కూలీలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



కేంద్రగ్రామీణాభివృద్ధిశాఖ ఈ ఏడాది నుంచి అమల్లోకి తెచ్చిన 'జన్‌మన్‌రేగా' యాప్ వినియోగంపై కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో కొన్నిచోట్ల యాప్ వాడకం జరుగుతుండగా, పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. అందుకు ప్రతీ వారం గ్రామాల వారీగా కూలీలతో సమావేశమై యాప్ వాడకం, ప్రయోజనాల గురించి తెలియపర్చాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం.

- శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ, నల్లగొండ జిల్లా


సాగర్ 2గేట్ల నుంచి నీటి విడుదల

- రెండు గేట్లు మూసివేత

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 16: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక కొనసాగుతుండటంతో దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఆదివారం నాలుగు గేట్ల నుంచి నీటి విడుదలను కొనసాగించగా, సోమవారం రెండు గేట్లు మూసివేసి రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 67,983 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7462టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి మొత్తం 77,998 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

నిలకడగా మూసీ నీటిమట్టం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూసీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో నిలకడగా కొనసాగుతోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 645 అడుగులుకాగా (4.46టీఎంసీలు) సోమవారం సాయంత్రానికి 644.15 అడుగులుగా(4.23టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 445.23 క్యూసెక్కుల వరద వస్తుండగా, కుడి, ఎడమ కాల్వలకు 630.62క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పులిచింతలలో 2గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగింపు

పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. రెండు క్రస్ట్‌గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు కాగా) సోమవారం సాయంత్రానికి 174.21 అడుగులుగా (44.53 టీఎంసీలుగా) నమోదైంది. కాగా ప్రాజెక్టుకు ఎగువ నుంచి 36,783 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. మొత్తం51,042 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దుబాయ్ తీసుకెళ్తామని ట్రావెల్ ఏజెన్సీ మోసం

సూర్యాపేటలో 28మంది నుంచి డబ్బులు వసూలు ● టూర్‌కు వెళ్లాల్సిన రోజు పత్తాలేని ఏజెన్సీ నిర్వాహకుడు

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 16 : అబుదాబీలో జరుగనున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు వెళ్దామనుకున్న సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులను ఓ టూర్ ఏజెన్సీ నిర్వాహకుడు మోసం చేశాడు. ఈ సంఘటన సోమవారం వెలుగుచూసింది. బాధితుడు గుండా లక్ష్మయ్య, సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అబుదాబీలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు వెళ్లేందుకు సూర్యాపేట నుంచి 28 మంది సంఘం సభ్యులు హైదరాబాద్‌లోని లోటస్ హాలిడేస్ అనే ట్రావెల్ ఏజెన్సీని సంప్రదించారు. ఒక్కో వ్యక్తికి అబుదాబీతో పాటు దుబాయ్ పరిసర ప్రాంతాల్లో విహారయాత్ర ప్రదేశాలను చూపించడంతో పాటు రానుపోను విమానచార్జీలు, దుబాయ్‌లో హోటల్‌లో బస, భోజన వసతి కల్పించేలా ప్యాకేజీతో ఒప్పందం చేసుకున్నారు. అందుకుగాను ఒక్కొక్కరి నుంచి రూ.85వేలను చెల్లించారు. అయితే అబుదాబీ వెళ్లేందుకు ఈ నెల 14న శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 10 గంటలకు విమానంలో బయలుదేరాల్సి ఉంది. అందుకోసం అందరూ కలిసి ఎయిర్‌పోర్టుకు వెళ్లగా ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడు సుభాష్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ఎంతసేపటికి ప్రయత్నం చేసినా అందుబాటులోకి రాలేదు. కాగా కొంతమంది సభ్యులు వేరే ట్రావెల్ ఏజెన్సీ ద్వారా డబ్బులు చెల్లించి వెళ్లారు. మిగిలిన వారందరం తిరిగి సూర్యాపేటకు చేరుకున్నారు. ఈ విషయమై పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారించి మోసం చేసిన ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేయనున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు. కాగా అబుదాబీలో జరుగుతున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకుడు టీజీ వెంకటేష్ దృష్టికి సూర్యాపేట సభ్యులు జరిగిన విషయాన్ని తెలపడంతో బాధితులకు న్యాయం చేయిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

శోభాయాత్రలో కత్తిపోట్లు

- దేవరకొండలో కలకలం ● యువకుడికి గాయాలు

దేవరకొండ, సెప్టెంబరు 16: దేవరకొండ పట్టణంలో సోమవారం నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో యువకుడిపై కత్తితో దాడి కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో శోభాయాత్ర జరుగుతుంది. పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని భూసరాజు సంతోష్ మద్యం మత్తులో కూరగాయలు కోసే కత్తితో పులిజాల శంకర్‌పై దాడి చేశారు. దీంతో శంకర్‌కు స్వప్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, అధికారులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన శంకర్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. పాత కక్షలతో సంతోష్ మద్యం మత్తులో దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

పోయి రావయ్యా... ఓ బొజ్జ గణపయ్య


నల్లగొండ పట్టణంలోని మొదటి విగ్రహ శోభాయాత్రలో పాల్గొన్న డీఎస్పీ, భక్తులు



దేవరకొండ: పాత రామాలయం వద్ద నిమజ్జన వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


మిర్యాలగూడ : వినాయక విగ్రహానికి పూలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్


కనగల్ ఎక్స్‌రోడ్డులో గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


వల్లభరావు చెరువులో నిమజ్జనం






నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌లో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్య నిమజ్జనం అయ్యారు. జిల్లాలో నవరాత్రులు మండపాల వద్ద వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన భక్తులు ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో వినాయకుడిని ఆశీనులను చేసి జైజై గణేషా అంటూ హర్ష ధ్వానాల మధ్య వాయిద్యాలు మోగుతుండగా గణేష్ నిమజ్జన యాత్రను ప్రారంభించారు. పట్టణంలోని పలు కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వరుస క్రమంలో క్లాక్‌టవర్ సెంటర్ చేరుకొని చిన్న విగ్రహాలు ఆర్జాలబావి, బతుకమ్మ కుంటలో, పెద్ద విగ్రహాలు 14వ మైలు రాయి వద్ద నాగార్జునసాగర్ కాల్వ వద్ద నిమజ్జనం చేశారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్రేన్ల సహాయంతో నీటిలోకి వినాయకులను వదిలారు. ఇబ్బంది జరగకుండా ప్రత్యేకగా గజ ఈతగాళ్లను, విద్యుత్, ఆరోగ్య శాఖ, పోలీస్‌శాఖ తదితర సిబ్బంది ఎప్పటికప్పుడు తమ పనులను చక్కదిద్దారు. గణేష్ నిమజ్జన యాత్ర శోభాయమానంగా జరగడంతో క్లాక్ టవర్ సెంటర్ అంతా జనసందడితో నిండిపోయింది. గణనాథులను చివరి సారిగా చూసేందుకు భక్తులు రోడ్లకు ఇరువైపులా నిలబడి దర్శించుకొని పరవశించిపోయారు. దారి పొడవునా తీరుతీరు గణనాథులు ఊరేగింపుగా వెళ్లడం కన్నుల పండువగా సాగింది. ఎక్కడ చిన్న ఘటన జరగకుండా పోలీసు యంత్రాంగం విగ్రహాల వెంట కాపాలా కాస్తూ ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకున్నారు. శాంతి సంఘం సభ్యులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు విగ్రహాలను ముందుండి నడిపించారు. పలు వినాయక మండపాల్లో భక్తులు వినాయక వస్త్రాలు, లడ్డూలు పోటీపడి మరి కైవసం చేసుకున్నారు. భక్తులు గణనాధుడికి చివరగా బీడ్కోలు పలికారు. జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి విగ్రహం వద్ద జరిగిన పూజల్లో బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకుడు చింత సాంబమూర్తి, పొనుగోటి చొక్కారావు పాల్గొన్నారు. పట్టణంలోని 18వ వార్డు అలివేలు మంగాపురం కాలనీలో శోభాయాత్రను కన్నుల పండుగగా నిర్వహించారు. మహిళలు కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దండ వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ చెనగోని ముత్తయ్య, ఉపాధ్యక్షుడు గుండపునేని కిషన్‌రావు, కోశాధికారి రమేష్, సభ్యులు, శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో గల 1వ నెంబర్ వినాయక మండపం వద్ద జరిగిన లడ్డూ వేలంపాటలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి రూ.13.5 లక్షలకు, హాలియాలోని అనన్య గ్రేటర్ కమ్యూనిటీ వెంచర్‌లో రిక్కల జానారెడ్డి పద్మ దంపతులు 2,01,116, కట్టంగూరు మండలంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన యూత్ కమిటీ సభ్యులు రూ.2లక్షల116లు పాడి లడ్డు దక్కించుకున్నారు.


శాలిగౌరారంలో యువకుల సందడి


మొదటి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న బీజేపీ నేతలు


హాలియా: చిన్న విగ్రహాన్ని తన రిమోట్ కారులో తీసుకెళ్తున్న చిన్నారి


హాలియా : పట్టణంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్


కేతేపల్లి: వినాయకుడి శోభాయాత్రలో మహిళల కోలాటం


పెద్దఅడిశర్లపల్లి: అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ : అలివేలు మంగాపురం కాలనీలో మహిళల కోలాట ప్రదర్శన

రాహుల్ ప్రధానికావడం ఖాయం : బాలునాయక్


పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 16: రాహుల్‌గాంధీ దేశ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం ఆయన సన్మానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాయ, సహకారాలతో మహేష్‌కుమార్‌గౌడ్ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, మాధవరెడ్డి, యాదగిరిగౌడ్, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

డిండి: మండలంలోని ఖానాపూర్ గ్రామంలో కొలువై ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయంలో సోమవారం ఎమ్మెల్యే బాలునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఎల్లప్పుడు దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండాలని ఆకాక్షించారు. ఆయన వెంట దొంతినేని వెంకటేశ్వరరావు, రాజేష్‌రెడ్డి, వెంకటయ్య, విజేందర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, అంతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సాయి ఉన్నారు.


అనుమతి లేకుండా చెట్ల నరికివేత


నరికి వేసిన చెట్లు

డిండి, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా సోమవారం చెట్లను నరికివేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం మొక్కలు నాటి సంరక్షించాలని ప్రచారం చేస్తుంది. కానీ మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సుమారు 20 ఏళ్ల క్రితం నాటిన చెట్లను నరికివేసి సొమ్ము చేసుకున్నారు. చెట్లను కొనుగోలు చేసిన వ్యక్తి మూడు లారీల్లో కలపను తరలించాడు. దీనిపై ప్రిన్సిపాల్ శిరీషను వివరణ కోరగా చెట్లను విక్రయించగా వచ్చిన రూ.20వేలతో బాతూం మరమ్మతులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

'ధరణి' ఫైళ్లను సత్వరమే పరిష్కరించాలి

● *మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్*


ఫైళ్లను పరిశీలిస్తున్న అమిత్‌నారాయణ్

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 16: ధరణికి సంబంధించి రైతుల పెండింగ్ ఫైళ్ల సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు కృషి చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ ఆదేశించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ధరణిలో వివిధ మాడ్యూల్స్ ద్వారా రైతులు దరఖాస్తు చేసుకున్న భూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్ టీఎం 33 ద్వారా మండలంలో దరఖాస్తులు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సబ్ కలెక్టర్ పెండింగ్‌లో ఉన్న పలు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ ఫైల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాకే ఉన్నతాధికారులకు అధికారులకు పంపాలని అన్నారు. అదేవిధంగా రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు పురోగతి గురించి అధికారులను అడిగారు. ఇప్పటివరకు వివిధ రెవెన్యూ టీంల ద్వారా ఎన్ని గ్రామాల్లో, ఎన్ని సర్వే నెంబర్లలో, ఎంత భూమి విస్తీర్ణంలో సర్వే పూర్తయిందన్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో భాగంగా అర్హులైన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి రైతులకు పాస్ పుస్తకాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారణమైన నిందితులను శిక్షించాలి



మౌనిక చిత్రపటంతో ధర్నా నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 16: దామరచర్ల మండలం పుట్టలగడ్డలో మౌనిక ఆత్మహత్యకు కారణమైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బంధువులు డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డుపై సోమవారం గాంధీ విగ్రహం వద్ద మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యుల ఆందోళనకు పలు ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు మద్దతు ప్రకటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన సంఘటనా స్థలానికి చేరుకొని వారించే ప్రయత్నం చేశారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదలబోమని భీష్మించారు. దీంతో టూటౌన్, రూరల్ సీఐలు నాగార్జున, వీరబాబు చట్టప్రకారం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు తమ ఆందోళన విరమించుకున్నారు.

ఆదర్శ పాఠశాల సిబ్బంది మొత్తం బదిలీ

నిడమనూరు, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మొత్తం ఏకకాలంలో బదిలీ అయ్యారు. పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులు ఉండగా, అందరినీ ఒకేసారి వివిధ పాఠశాలలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు హుటాహుటిన తమకు కేటాయించిన పాఠశాలల్లో రిపోర్టు చేశారు. 2013లో ఆదర్శ పాఠశాలలు ప్రారంభం కాగా, ఉపాధ్యాయ సిబ్బంది అప్పటి నుంచి ఒకే పాఠశాలలో పని చేస్తున్నారు. ఎట్టకేలకు 11 ఏళ్లకు వారికి బదిలీలకు మోక్షం లభించింది. నిడమనూరు ఆదర్శ పాఠశాలకు చెందిన 15 మంది ఉపాధ్యాయులు బదిలీలు కాగా వారి స్థానంలో 13 మంది నూతన ఉపాధ్యాయులు వచ్చారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులు రావాల్సి ఉంది. అదే విధంగా ప్రిన్సిపాల్ లోగిశెట్టి రంజిత నిడమనూరు నుంచి మిర్యాలగూడ మండలం తుంగపహడ్‌లోని ఆదర్శ పాఠశాలకు బదిలీ కాగా ఆమె స్థానంలో త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ధ్వంసమైన డీ 40 కాల్వకు మరమ్మతులు చేయాలి


డి 40 కాల్వ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తిప్పర్తి, సెప్టెంబరు 16: ఇరిగేషన్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కాల్వలు ధ్వంసమవుతున్నాయని తిప్పర్తి, ఇండ్లూరు గ్రామాల రైతులు ఆరోపించారు. మండల కేంద్రంలోని నకిరేకల్ రోడ్డులో గల డీ 40 కాల్వ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సరైన వర్షాలు లేక భూగర్భజలాలు తగ్గి బోర్లు పోయడం లేదని అన్నారు. ఆందోళన వ్యక్తం చేశారు. తిప్పర్తి, ఇండ్లూరు గ్రామాల మధ్య నుంచి సర్వారం, ఇందుగుల గ్రామాల వైపు వెళ్తున్న డీ40 కాల్వ పరిధిలోని 20 ఎల్ వద్ద కింది డ్రాపును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆరోపించారు. దీంతో వచ్చిన నీళ్లు కిందకి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం నాట్లు వేసిన పొలాలు నీరులేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అధికారులు, నాయకులు స్పందించి వెంటనే డీ 40 కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయడంతో పాటు, ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు నలపరాజు యాదయ్య, రొట్టెల జానయ్య, లవిశెట్టి వీరేశం, రొట్టెల కృష్ణ, మల్లేష్, కొత్త సందీప్, కోటేష్, రొట్టెల సైదులు, రాములు, నేదునూరి కోటయ్య, కస్పరాజు వెంకన్న, సైదులు, నూకల అంజయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

● *మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి*

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 16: తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని గూడూరులో సాయుధ పోరాటంలో పాల్గొన్న పెద్దరపు లచ్చయ్య, బొంగరాల కనకమ్మ, ముగల లక్ష్మమ్మలను సోమవారం ఆయన సన్మానించి మాట్లాడారు. సాయుధ పోరాట చరిత్ర రైతులు లిఖించుకున్న చరిత్ర అని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. అలాంటి చరిత్రను నేడు బీజేపీ హిందూ, ముస్లింలకు జరిగిన గొడవగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతాంగ పోరాటంలో అమరవీరుల ఉద్యమపోరు మనకు స్ఫూర్తి కావాలన్నారు. అమరుల ఆశయాలను సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డబ్బీకార్ మల్లేష్, నూకల జగదీశ్చంద్ర, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, బొగ్గారపు కృష్ణయ్య, శ్రీనివాస్, గోపి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


సాయుధ పోరాట ఉద్యమకారులను సన్మానిస్తున్న జూలకంటి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

రైతులకు అండగా ప్రభుత్వం

● *ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి*

పెద్దవూర, సెప్టెంబరు 16: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. రైతు రుణమాఫీ కూడా చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు ప్రజాపాలన కొనసాగిస్తుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.70కోట్ల నిధులను విడుదల చేసిందని, త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీఫ్లోర్ లీడర్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు అబ్బిడి కృష్ణారెడ్డి, గుంటుక వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 16: మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని ముస్లిం సోదరులు పలు మసీదుల్లో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త మానవాళికి ప్రసాదించిన సన్మార్గాన్ని, ఆయన బోధనలను మౌలానాలు తమ శాంతి సందేశంలో పేర్కొన్నారు. ప్రేమ, త్యాగానికి ప్రతిరూపమైన మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రజలను సన్మార్గంలో నడిపిస్తాయని ఉపదేశించారు. అనంతరం ఖురాన్ పఠనం జరిగింది. ముస్లిం యువకులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ముస్లిం సోదరులు ప్రత్యేకంగా పాయసంతో పాటు ఇతర వంటకాలను తయారు చేసి పేదలకు అందజేశారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

● *జల నిపుణుడు శ్యాంప్రసాద్‌రెడ్డికి ఘన సన్మానించిన మంత్రులు*


శ్యాంప్రసాద్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 16: ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జల నిపుణుడు, రాష్ట్రం లో ప్రాజెక్టుల నిర్మాణానికి సలహాలు, సూచనలు అందిస్తున్న తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డిని ఇంజనీర్స్‌డే సందర్భంగా సోమవారం మంత్రులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శ్యాంప్రసాద్‌రెడ్డి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, డిండి, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల నిర్మాణం పురోగతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. దివంగత ఆర్.విద్యాసాగర్‌రావు ప్రాజెక్టుల నిర్మాణానికి చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.